క్లుప్తంగా

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా రాజారెడ్డి

ములకలచెరువు : మండలంలోని శివరాంపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు రాజారెడ్డి ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. భీమవరంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాజారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ఎస్టీయూ మండల నాయకులు అమరనాథ్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు, నౌషాద్, రామకృష్ణ, కృష్ణారెడ్డి, మంజులమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేసారు.

ఉపాధ్యక్షుడిగా మురళి

రామసముద్రం : రాష్ట్ర ఎస్టీయూ ఉపాధ్యక్షుడిగా కడియాల మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర 77వ కౌన్సిల్ సమావేశంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం సీతరగానిపల్లెలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మురళిని రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పశు బీమా సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పాడి ఆవులకు రూ.384, గొర్రెలు, మేకలకు రూ.30ల చొప్పున ఇన్సూరెన్స్ చేసుకోవచ్చన్నారు.

ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం వర్ధంతి

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వాతంత్య్ర సమరయోధుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సలీంఖాన్ మాట్లాడుతూ గుణాత్మక విద్యకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ బాటలు వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రిజ్వానా బేగం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పీలేరు పర్యటన

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం పీలేరులో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కోటపల్లెలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి నివాసంలో పీలేరు గ్రామ పంచాయతీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

పీలేరు : ప్రైవేటు పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 25 శాతం ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యహక్కు చట్టంలోని సెక్షన్ 12(1) సీ ప్రకారం 1వ తరగతిలో 5 నుంచి 6 సంవత్సరాల వయస్సు విద్యార్థులు మార్చి 14వ తేదీ లోపు గ్రామ సచివాలయాల్లో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

యువత పాత్ర కీలకం

పీలేరు రూరల్: నవ భారత నిర్మాణంలో యువత పాత్ర కీలకమైందిన తహసీల్దార్ ఎస్. మహబూబ్‌బాషా అన్నారు. గురువారం పీలేరు షీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ నెహ్రూ యువ కేంద్రం, కడప, అన్నమయ్య జిల్లాల ఓటర్ అవగాహన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎన్నికల డీటీ సుబ్రమణ్యం, ఆర్ఐ చాణక్య, ఏఎస్ఓ రామ్మోహన్, షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ, డాక్టర్ రాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యతోనే..

కలకడ : ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీపీ శ్రీదేవి, మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కలకడ ఆదర్శపాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠశాల చైర్మన్ కెఎస్ మస్తాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేవీపల్లె, కలకడ ఆదర్శపాఠశాలల ప్రిన్సిపాల్ ప్రదీప్, మల్లంగ్ షావల్లీ, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలోని జెడ్పీ హైస్కూల్‌ను లిప్ (లాంగ్వేజ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామ్) రాష్ట్ర పరిశీలకులు, బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తనిఖీ చేశారు. రాష్ట్రంలో 11 జిల్లాల్లో లిప్ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక హైస్కూల్లో రామకృష్ణ బృందంతో కలిసి పర్యటించారు. ఎంఈఓ సుబ్రమణ్యం, హెడ్మాస్టర్ అహ్మద్‌సాహేబ్, ఉపాధ్యాయులు చింతిర్ల రమేష్, జావీద్ పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదవండి

మదనపల్లె సిటీ : ప్రణాళికబద్ధంగా చదివితే డీఎస్సీలో విజయం మీదేనని స్థానిక గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి అన్నారు. గురువారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు కుట్టి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా మెటీరియల్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ మెటీరియల్‌ను అభ్యర్థులను ఉపయోగించుకోవాలన్నారు. కుట్టి కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు రామకృష్ణ మాట్లాడుతూ సేవా దృక్పథంతో తాము పడిన కష్టాలు నేడు యువతకు దూరం చేయాలనే ఆశయంతో ఉచిత మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

- 29 నుంచి ఎన్నికల ప్రచారం
- కార్యకర్తల కృషి మరువలేం
- విభేదాలు పక్కన పెట్టండి..
- సమష్టిగా పనిచేయండి
- ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

కేవీపల్లె : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ధీమావ్యక్తం చేశారు. గురువారం మండలంలోని వగళ్ల కరీమా ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఘన విజయాన్ని అందించిన పార్టీ నాయకులు, కార్యకర్తల మేలును తాము మరువలేమన్నారు. మరోసారి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో గత ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కుటుంబంతో ఢీ కొట్టి విజయాన్ని సాధించామని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో విజయాన్ని సాధించిన మనం.. ఈ సారి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో సులభంగా విజయం సాధించవచ్చునని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో నాయకుల మధ్య చిన్నచిన్న విభేదాలు ఉంటే అవి పక్కన పెట్టి ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టనష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ నెల 29వ తేదీ నుంచి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి చురుగ్గా పాల్గొంటారని, వారితో కలసి పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్షించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు సహదేవరెడ్డి, సాహిత్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ప్రదీప్‌రెడ్డి, గజ్జెల శ్రీనురెడ్డి, జయరామచంద్రయ్య, సైఫుల్లాఖాన్, ఆనందరెడ్డి, రామకొండారెడ్డి, వెంకటసిద్దులు, మోహన్‌రెడ్డి, యర్రమరెడ్డి, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరుసుకు ఆహ్వానం

వాల్మీకిపురం : స్థానిక హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. గురువారం కేవీపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలసి మిథున్‌రెడ్డిని సన్మానించారు. ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉరుసు ఉత్సవానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సందాని బాషా, సభ్యులు షాహెద్, జబ్బార్ సాహెబ్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి

ఆర్డీఓ హరిప్రసాద్



బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

నిమ్మనపల్లె : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ)లు బాధ్యతగా పనిచేయాలని మదనపల్లి ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాలాజీ రాజుతో కలసి బీఎల్ఓ, సూపవైజర్లకు ఎన్నికల నిబంధనలు, ఓటరు జాబితా సవరణ, ఈవీఎంల పనితీరు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా రూపకల్పన, సవరణ, క్షేత్ర స్థాయి పరిశీలనలో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలోని తప్పులను వారంలోపు సరిచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, తదితర సదుపాయాల బాధ్యత బీఎల్‌ఓలదేనని అన్నారు. అనంతరం అడుసుపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం అందుబాటులో లేవని వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మైథిలి, ఎంఈఓ నారాయణ, డీటీలు తపస్విని, సిరాజుద్దీన్, ఏఎస్ఓ జగన్నాథం, ఏఓ రమేష్ బాబు, విలేజ్ సర్వేయర్లు, బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మదనపల్లె సిటీ : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. గురువారం స్థానిక కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం, గ్రామజ్యోతి సొసైటీ సంయుక్తంగా ఓటు హక్కులు, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలియజేస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి ప్రజాస్వామ్యంలో శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని పేర్కొన్నారు. మంచి పాలకులను ఎన్నుకోవాలంటే ఓటు హక్కును ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఐ హరిహరప్రసాద్, గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకురాలు సుభద్ర, అధ్యాపకులు వనజ, విష్ణుప్రియ, ఖాజావల్లి, హాజీరా, వెంకటశివ, నాగమణి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

కాలేజీ విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు జాబితాలో పేరు నమోదు, ఓటు వేయడానికి క్యూ, ఓటు వినియోగం తదితర అంశాలపై మాక్ పోలింగ్ నిర్వహించారు.

'స్వామిత్వ'తో భూ హక్కులు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



స్వామిత్వ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ద్వారకనాథరెడ్డి

కురబలకోట : 'స్వామిత్వ'తో ఇంటి స్థలాలపై భూ హక్కులు ఏర్పడతాయని, ఆస్తి తగాదాలు తొలగిపోతాయని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బ్రాహ్మణ ఒడ్డుపల్లెలో 105 మందికి స్వామిత్వ ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ చేపట్టిన భూ హక్కుల పథకం విప్లవాత్మకమైనదని కొనియాడారు. ఈ హక్కు పత్రాల ద్వారా బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చన్నారు. ఇతర ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అదే విధంగా సీఎం జగన్ ప్రభుత్వంలో వివిధ ప్రభుత్వ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఇంటి తలుపు తడుతున్నాయన్నారు. ఇంటికి ఐదారు పథకాలు కూడా వస్తున్నాయని తెలిపారు. త్వరలో రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఇరగం సుబ్బారెడ్డి, రేవతి, ఎంపీపీ బి. దస్తగిరి, బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్. ఉమాపతిరెడ్డి, ఎం. ఫిరోజ్‌ఖాన్, తహసీల్దారు ఈశ్వరమ్మ, హరినారాయణ, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, కోళ్ల వాసుదేవ రెడ్డి, భూదేవి, శేషగిరిరావు, ఫజరుల్లా,యాసాన్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కులు పంపిణీ

పెద్దమండ్యం : ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక తెలిపారు. అలాగే గ్రామ వలంటీర్ల సేవలకు పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలోని 616 స్వయం సహాయక సంఘాలకు రూ.5 కోట్ల రూపాయల ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, వలంటీర్ల సేవలకు పురస్కార ప్రధానోత్సవానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

డీఎస్పీ ప్రసాదరెడ్డి బాధ్యతల స్వీకరణ



మదనపల్లె : మదనపల్లె సబ్‌డివిజన్ పోలీస్ అధికారిగా జి.ప్రసాదరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె డీఎస్పీ కేశప్ప అడిషనల్ ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం అర్బన్ డీఎస్పీగా పనిచేస్తున్న ప్రసాదరెడ్డిని మదనపల్లెకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరెడ్డిని డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరెడ్డిని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

నిస్సహాయులను ఆదుకుంటే దేవునికి ఆనందం

కురబలకోట : 'ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి. కష్టాల్లో ఉన్న వారిపట్ల కనికరం చూపాలి. నిస్సహాయులకు సాయం చేస్తే అల్లా ఎంతగానో సంతోషస్తాడు' అని కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుస్సేనీ ఉద్బోధించారు. కురబలకోట మండలంలోని అంగళ్లలో హిందూముస్లింల ఆధ్వర్యంలో హజ్రత్ సయ్యదినా షేఖ్ అబ్దుల్‌ఖాదర్ జిలాని పీరా నెపీర్ గౌసుల్ అజం దస్తగీర్ వారి ఉరుసు ఉత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి వచ్చిన ఆయన సంప్రదాయ బద్ధంగా గంధోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత సామరస్యాన్ని పాటించాలని కోరారు. శాంతి యుత జీవనం సాగించాలని సూచించారు. సమాజంలో స్వార్థం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక చింతన, సన్మార్గం ఉంటే వారి జీవితం, జీవనం సాఫీగా సాగుతుందని తెలిపారు. సుఖ శాంతులతో నడచుకోవాలని అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

నేడు తలనీలాల వేలం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాల వేలం పాటను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజుల తెలిపారు. గురువారం స్థానిక ఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం (నేడు) ఉదయం 11 గంటలకు సీల్డ్ టెండర్ ప్రక్రియ మరియు బహిరంగ వేలం ద్వారా దేవాదాయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. దేవాదాయశాఖ నిబంధనల మేరకే వేలం పాట జరుగుతుందన్నారు.

నేడు ఆర్టీసీ ఎండీ రాక

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు రానున్నారు. ఎండీతో పాటు ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి కూడా హాజరుకానున్నారు. అనంతరం డిపోను తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోటాపోటీగా ఆలయ భూముల వేలం

కురబలకోట : కురబలకోట శ్రీ కోదండరామస్వామి ఆలయ భూముల కౌలు (గుత్త) వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. బహిరంగ వేలం పాటల ద్వారా రూ.3,93,700 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ మంజుల గురువారం తెలిపారు.

పురాతన కోనేరుకు మహర్దశ

తంబళ్లపల్లె : తంబళ్లపల్లెలో టీ.ఎస్ కుటుంబీకులు సుమారు వంద సంవత్సరాల క్రితం శివాలయంలో కోనేరును రాతి కట్టడంతో ఆకర్షణీయంగా నిర్మించారు. ప్రస్తుతం కోనేరు శిథిలావస్థకు చేరుకుంది. ఉపాధి హామీ నిధులతో పునర్నిర్మించేందుకు గురువారం ఏపీడీ మధుబాబు, ఏపీఓ అంజనప్ప శ్రీకారం చుట్టారు.

జగన్మోహిని అవతారంలో లక్ష్మీజనార్దనుడు

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన అతిపురాతన శ్రీలక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారథి బట్టర్, కులశేఖర బట్టర్ తీర్థప్రసాదాలు అందజేశారు.

సమన్వయంతోనే అభివృద్ధి

ఎంపీపీ నూర్జహాన్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

కలికిరి : అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ నూర్జహాన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణయ్య మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారి మాట్లాడుతూ 2003 కంటే ముందు ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ పట్టాలు మంజూరు చేసిన రైతులకు ప్రస్తుతం పూర్తి హక్కులు కల్పించినట్లు తెలిపారు. ఇకపై రైతులు సర్వహక్కులతో క్రయవిక్రయాలకు వీలుంటుందన్నారు. మండల పరిధిలో 2,700 మందికి పైగా రైతులకు 3,400 ఎకరాలకు ఫ్రీహోల్డ్ రైట్స్‌తో లబ్ధి చేకూరినట్లు ఆమె తెలిపారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేష్ మాట్లాడుతూ బేస్‌మెంట్ వరకు పనులు జరిగి ఆగిన గృహ లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా ప్రభుత్వం నుంచి రూ.20 వేలు అడ్వాన్స్ బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. విద్యుత్ లైన్ మార్పు, తాగునీటి స్కీం బోర్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర విద్యుత్ సమస్యలపై ఏఈ ముజీబుర్ రెహ్మాన్‌ను సభ్యులు నిలదీశారు. ట్రాన్స్‌కో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి ట్రాన్స్‌పోర్టేషన్ బిల్లులు మంజూరు చేయాలని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, సూపరింటెండెంట్ వేమనారాయణ, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, బీబీ ఇస్తియాక్, అరుణబాబు రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు అల్లా బకష్, షాహీన తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు 'ఉయ్యాలవాడ'



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

వాల్మీకిపురం : బ్రిటిష్ ప్రభుత్వం తిరుగుబాటు చేసిన ప్రథమ స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ కొనియాడారు. గురువారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర పోరాటానికి పదేళ్ల ముందే బ్రిటీష్ దుష్టపాలనపై ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు అమరనాథ రెడ్డి, నాగేశ్వర, నాగరాజు, పురుషోత్తం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి ఆదర్శప్రాయుడు

మదనపల్లె సిటీ : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అందరికి ఆదర్శప్రాయుడని అఖిల భారత రెడ్డి సంఘాల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు కనుకొండ మద్దిరెడ్డి కొనియాడారు. గురువారం స్థానిక బెంగుళూరు రోడ్డులోని కేఎంఆర్ కాంప్లెక్స్‌లో ఉయ్యాల నరసింహారెడ్డి 177 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నరసింహారెడ్డి వర్ధంతిని కుల, మతాలకు అతీతంగా జరుపుకోవాలని మద్దిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కంభం నాగభూషణరెడ్డి, గౌరవ సలహాదారులు తిమ్మారెడ్డి, రామమోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత మినరల్ నీటిని సద్వినియోగం చేసుకోండి



మినరల్ వాటర్‌ను ప్రారంభిస్తున్న సునీత, రవికుమార్‌రెడ్డి

కలకడ : ఉచిత మినరల్ వాటర్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గుడిబండ సర్పంచ్ సునీత, కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి దంపతులు కోరారు. గురువారం మండలంలోని గుడిబండ పంచాయతీ గుడిబండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినిరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రతి ఇంటికి ఉచితంగా తాగునీటిని అందించడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, సుబ్బరాయుడు, రామారెడ్డి, చిన్నగంగులు, ఖాదర్‌ఉస్సేన్, వెంకటరమణ, బాలాజీ, శంకర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు

రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా



కలకడ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాష

కలకడ : రాయచోటి డివిజనల్ పరిధిలోని అన్ని పోలింగ్ బూతులల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాష తెలిపారు. గురువారం కలకడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మండలాల వారి సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ స్టేషన్‌లు గుర్తించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రామకృష్ణారెడ్డిని ఆదేశించారు. రౌడీషీటర్లను అదుపులోకి తీసుకోవడం, ఎన్నిక రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలు తెలుసుకున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. కేసుల పురోగతిపై శ్రద్ధ పెట్టాలని, పేకాట, సారా స్థావరాలపై నిత్య దాడులు కొనసాగించాలని సూచించారు. ప్రతి కేసు, ఘర్షణలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం
- అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న నిసార్‌అహ్మద్, నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు

మదనపల్లె : సీఎం జగనన్న పాలనలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకానికి సారథులు వలంటీర్లేనని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. గురువారం స్థానిక జేసీఎం ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన, ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వారికి వందనం చెబుతూ... గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు అని అన్నారు. సూర్యుడు ఉదయించకముందే ఇంటి తలుపుతట్టి పెన్షన్ అందించడం, కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు చేయడంలో వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. నేడు వివక్ష లేకుండా, కులం, మతం, ప్రాంతం చూడకుండా అర్హత మాత్రమే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయంటే వలంటీర్ వ్యవస్థే కారణమని చెప్పారు. అందుకే ప్రతిపక్షనాయకులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. వలంటీర్ల వ్యవస్థకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం కలను వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో జగనన్న సాకారం చేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దేశవ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతులు వచ్చేందుకు కారణం వలంటీర్లేనని ప్రశంసించారు.

వాలంటీర్లకు పురస్కారాలు

రాజానగర్ సచివాలయ పరిధిలోని వలంటీర్ పచ్చిపాల మురళికి సేవావజ్ర పురస్కారం, రూ.45 వేల నగదు అందించారు. ఎస్వీఆర్ లేఅవుట్ సచివాలయానికి చెందిన ఖాదర్‌బాషా, నక్కలదిన్నె సచివాలయం కే.దీపారాణి, చౌడేశ్వరినగర్ సచివాలయం బొమ్మిశెట్టి పుష్పలత, దర్నీపేట సచివాలయం ముజమిల్‌సయ్యద్, ప్యారానగర్ సచివాలయం నుంచి పఠాన్‌ఖదిరున్నీసాలకు సేవారత్న పురస్కారం, ఒకొక్కరికి రూ.30వేలు నగదు, మిగిలిన 450 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారం, ఒకొక్కరికి రూ.15వేల నగదుతో పాటుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, వైస్‌చైర్మన్‌లు జింకా చలపతి, నూర్‌ఆజం, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, ఆంజనేయులు, ఎల్ఐసీ.సుధాకర్, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, బావాజీ, మున్సిపల్ కౌన్సిలరు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

మున్సిపాలిటీలోని 22వవార్డు ప్యారానగర్‌లో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డుకు గురువారం నిసార్ అహ్మద్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 35 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కౌన్సిలర్ ముబీనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం,జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, టెలికాంబోర్డ్ మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, ఎస్వీ.రమణ, ప్రసాద్ బాబు, రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, సాయిశేఖర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.